ఆంధ్రజ్యోతి
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
బుధవారం 11 సెప్టెంబరు 2024



అప్రమత్తంగా ఉండండి

ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే తక్షణం రక్షణ, సహాయక చర్యలు చేపట్టండి

- ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశం
- విశాఖ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్
- జలాశయాల స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకోండి
- గేట్ల పనితీరు పనితీరు పరిశీలించండి
- ప్రతి గ్రామంలో ఐదుగురితో ఆపద మిత్ర బృందాలను ఏర్పాటుచేయండి
- వరద సహాయక చర్యలపై శిక్షణ ఇవ్వండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న హోం శాఖ మంత్రి వి.అనిత

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్షణ రక్షణ, సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులను రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. వైపరీత్యాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల వాటిల్లిన నష్టం, తీసుకున్న సహాయ చర్యలపై విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం ఉదయం విశాఖ పట్నం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ భారీవర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విజయవాడలో మాదిరిగా సహాయ రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లాలోని జలాశయాల స్థితిగతులపై కలెక్టర్లు సమీక్షిస్తుండాలని ఆదేశించారు. పనిచేయని, పాడైన రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రతికూల పరిస్థితుల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడడమే కాకుండా, సహాయ చర్యల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతోపాటు వారి బోట్లను కూడా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపద మిత్ర బృందాలను ఏర్పాటుచేసి వారికి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై శిక్షణ ఇవ్వాలన్నారు. దీనివల్ల ముందస్తు రక్షణ చర్యలకు అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో శాశ్వత టోల్‌ఫ్రీ, ల్యాండ్ లైన్ నంబర్లను ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రజలకు అవగాహన పెరుగుతుందన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

జిల్లాలో 40 ఇళ్లకు నష్టం

అనకాపల్లి టౌన్ : అనకాపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, జిల్లాలో ఆరో తేదీ నుంచి మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిశాయని చెప్పారు. వర్షాల ... మిగతా 8వ పేజీలో

ముంపులోనే పొలాలు

వర్షం తగ్గినప్పటికీ వీడని వరద


- లోతట్టు భూముల్లో వరిపైరు నీట మునిగి.. కుళ్లిపోతున్నదని అన్నదాతలు ఆవేదన
- పంట నష్టం అంచనాల్లో వ్యవసాయ శాఖ

బంగాళాతంలో ఏర్పడిన వాయుగుండం తీరాన్ని దాటి, వర్షాలు ఆగినప్పటికీ పలుగ్రామాల్లో పంట పొలాలు మంగళవారం కూడా నీటి ముంపులోనే వున్నాయి. వర్షం నీటిపారుదల వ్యవస్థ సవ్యంగా లేని, బాగా లోతట్టుగా వున్న ప్రాంతాల్లో వరద ముంపు తొలగలేదు. పొలాల్లో మూడు, నాలుగు అడుగుల లోతున నీరు వుండడంతో ముంపు నుంచి బయటపడడానికి ఎన్ని రోజులు పడుతుందో అర్థం కావడంలేదని, వరినాట్లు నాలుగైదు రోజులకు మించి పూర్తిగా నీట మునిగితే మొక్కలు కుళ్లిపోయి చనిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చోడవరం, రాంబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, మాకవరపాలెం, కోటవురట్ల, అనకాపల్లి, తదితర మండలాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది.




చోడవరం మండలం కన్నంపాలెంలో నీటిముంపులోనే ఉన్న వరి, చెరకు పంటలు

చోడవరం, సెప్టెంబరు 10: మండలంలోని పలు గ్రామాల్లో దాదాపు 600 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. సోమవారం రాత్రి నుంచి వర్షం పూర్తిగా ఆగిపోయి సాధారణ వాతావరణం నెలకొన్నప్పటికీ, పంట భూముల్లో వరద నీరు ఇంకా తగ్గలేదు. దీంతో పంటలు కుళ్లిపోతాయని రైతులు వాపోతున్నారు. పెద్దేరు, శారదా, బొడ్డేరు నదుల్లో ఆది, సోమవారాలు వరద ఉధృతంగా ప్రవహించడంతోపాటు భారీ వర్షాలు కురవడంతో మండలంలోని కన్నంపాలెం, రామజోగిపాలెం, తిమ్మనపాలెం, బెన్నవోలు, ముద్దుర్తి, గంధవరం, లక్ష్మీపురం, అంకుపాలెం, నరసయ్యపేట, వెంకన్నపాలెం, భోగాపురం, చాకిపల్లి, ఖండేపల్లి, గవరవరం, లక్కవరం, దుడ్డుపాలెం, పీఎస్‌పేట, అన్నవరం గ్రామాల్లోని వరి, చెరకు పంటలు నీటమునిగాయి. ముఖ్యంగా కన్నం పాలెం, రామజోగిపాలెం గ్రామాల్లో పంట పొలాలు పూర్తిగా నీటమునిగి జలాశయాన్ని తలపిస్తున్నాయి. మంగళవారానికి కూడా శారదా, పెద్దేరు నదుల్లో వరద ఉధృతి తగ్గకపోవడంతో పంటపొలాల్లో నుంచి వరదనీరు బయటకు పోవడం లేదు. మండలంలో 235 హెక్టార్లలో పంటలు నీటమునిగి నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ అధికారులు ... మిగతా 8వ పేజీలో



రాంబిల్లి మండలం రాజుకోడూరు వద్ద ముంపునకు గురై చెరువును తలపిస్తున్న వరి పొలాలు



జాగారాల గెడ్డకు గండి పడడంతో పొలాలను ముంచెత్తుతున్న వరద

జాగారాల గెడ్డకు గండి

- 110 ఎకరాల్లో మునిగిన వరి పంట

మాకవరపాలెం, సెప్టెంబరు 10: మండలంలోని జి.కోడూరులో జాగారాల గెడ్డకు గండి పడడంతో జి.కోడూరు, నగరం గ్రామాల్లో సుమారు 110 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. మంగళవారం కూడా గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో పొలాల్లో వరద తగ్గలేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జాగారాల గెడ్డ గట్లను పటిష్ఠం చేయకపోవడంతో ఏటా వర్షాకాలంలో గండ్లుపడడం, వరిపొలాలు నీటమునగడం, సమీపంలోని పంట భూములు కోతకు గురై ఇసుక మేట వేయడం ఆనవాయితీగా మారింది. ఉపాధి హామీ పథకం కింద తాత్కాలికంగా గండ్లు పూడ్చడం తప్ప, గట్లను పటిష్ఠం చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వమైన స్పందించి జాగారాల గెడ్డ గండ్లబారి నుంచి విముక్తి కల్పించాలని పలువురు సాగు రైతులు కోరుతున్నారు.



చింతపల్లి-సీలేరు మధ్య జీకే వీధి మండలం ఆడపరుగొంది వద్ద భారీగా కోతకుగురై ఆనవాళ్లు లేని రహదారి

సీలేరు, భద్రాచలం బస్సులు రద్దు

రహదారి మరమ్మతుల అనంతరమే సర్వీస్‌లు పునరుద్ధరణ

పాడేరు, మాడుగుల సర్వీస్‌లు చోడవరం వరకే...

విశాఖపట్నం, సెప్టెంబరు 10: విశాఖ నుంచి సీలేరు రాకపోకలు సాగించాల్సిన నాలుగు బస్సులు, భద్రాచలం నుంచి రాకపోకలు సాగించాల్సిన నాలుగు బస్సులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం ప్రకటించింది. ఈ నెల ఒకటో తేదీన కురిసిన వర్షాలకు రోడ్లు జలమయం కావడంతో రెండో తేదీ నుంచి ఈ సర్వీస్‌లను రద్దు చేశారు. రెండు రోజుల నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బస్సులు నడిపేందుకు ఇంజనీరింగ్ అధికారులు రూట్ సర్వే నిర్వహించారు. అయితే అనేకచోట్ల గోతులు/గండ్లు పడి ఉండడంతో ఆ మార్గంలో బస్సులు నడపడం సాధ్యం కాదని ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మొత్తం గండ్లు, గోతులు పూడ్చిన తరువాత ట్రయల్ రన్ వేసిన పిమ్మట ప్రయాణికులకు సేవలు అందిస్తామని అధికారులు వెల్లడించారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

నేటి నుంచి అరకు బస్సుల పునరుద్ధరణ

భారీవర్షాలు, వరదల కారణంగా విశాఖ-అరకులోయ మధ్య రాకపోకలు సాగించే మూడు బస్సులను గత శనివారం నుంచి నాలుగు రోజుల పాటు రద్దు చేశారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించడంతో బుధవారం నుంచి ఈ సర్వీసులను పునరుద్ధరించనున్నట్టు రీజియన్ అధికారులు ప్రకటించారు.

చోడవరం వరకే మాడుగుల, పాడేరు బస్సులు

విశాఖపట్నం నుంచి మాడుగుల, పాడేరు వెళ్లాల్సిన సర్వీసులను చోడవరం వరకే నడుపుతున్నారు. భారీ వర్షాల కారణంగా చోడవరం నుంచి మాడుగుల, పాడేరు రూట్‌లు బాగా పాడయ్యాయి. ప్రయాణికులతో ఈ రూట్లలో బస్సులు నడపడం అంత క్షేమం కాదని బస్సులు చోడవరం వరకే నడిపేందుకు నిర్ణయించారు.

అనకాపల్లి, నర్సీపట్నం డిపోల పరిధిలో..

అనకాపల్లి టౌన్ : భారీ వర్షాలకు పలుచోట్ల రోడ్లు, వంతెనలు, కల్వర్టులు ధ్వంసం కావడంతో మంగళవారం కూడా పలు బస్సులను రద్దు చేసినట్టు డీపీటీవో కె.పద్మావతి తెలిపారు. అనకాపల్లి డిపో నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా జోలాపుట్టు వెళ్లే రెండు బస్సులను, మాడుగుల బస్‌ను రద్దు చేశామన్నారు. అలాగే నర్సీపట్నం డిపో నుంచి చింతపల్లి, అడ్డరోడ్డు, మంప, మారేడుమిల్లి, సీలేరు, రేవళ్లకు వెళ్లే బస్సులతోపాటు రెండు బడి బస్సులను కూడా రద్దు చేసినట్టు వెల్లడించారు.

ఫినిష్ ఆంధ్రా!

మూతపడిన చేపలు, రొయ్యలు, పీతల విక్రయ కేంద్రాలు

- గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన పేరుతో 'ఫిష్ ఆంధ్రా' అవుట్‌లెట్లు
- ఆర్భాటంగా ప్రచారం చేసిన వైసీపీ పాలకులు
- మూన్నాళ్ల ముచ్చటగా మారిన సరకు సరఫరా
- ఒక్కటొక్కటిగా అవుట్‌లెట్‌లు మూత



మూసివేసిన చేపల అమ్మకం దుకాణాలు

చోడవరం, సెప్టెంబరు 10: నిరుద్యోగ యువతకు వ్యాపారాల ద్వారా ఉపాధి కల్పన అంటూ గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన 'ఫిష్ ఆంధ్రా' యూనిట్లు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. జిల్లాలో ఒక్కడా ఒక్క అవుట్‌లెట్ కూడా వినియోగంలో లేదు.

'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మత్స్య శాఖ అధికారులు పలు గ్రామాల్లో చేపలు, రొయ్యలు, పీతలు వంటి వాటి విక్రయానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులతో ఫిష్ ఆంధ్ర యూనిట్లు ఏర్పాటు చేయించారు. ఒక్కో యూనిట్ విలువ రూ.2.5 లక్షలు కాగా.. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం, బీసీలకు 40 శాతం, మైనారిటీలకు 50 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పది శాతం సొమ్మును లబ్ధిదారులు పెట్టుబడిగా పెట్టుకుంటే మిగిలిన సొమ్మును బ్యాంకుల నుంచి రుణంగా మంజూరు చేయిస్తామని అధికారులు చెప్పడంతో 'ఫిష్ ఆంధ్రా' యూనిట్లు పెట్టడానికి చాలా మంది ముందుకు వచ్చారు. వీరిలో అర్హులను ఎంపిక చేసిన మత్స్యశాఖ అధికారులు.. ముందస్తు పెట్టుబడిగా లబ్ధిదారుల నుంచి వారి వాటా నిధులు (ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల వరకు) వసూలు చేశారు. ఫ్రిజ్‌లు, ఐస్ బాక్సులు, కట్టర్స్, తూకం యంత్రాలు, ఇతర సామగ్రిని సరఫరా చేశారు. అన్ని కేంద్రాలకు తాజా చేపలు రొయ్యలు పీతలు సరఫరా చేస్తామని చెప్పారు. పలుచోట్ల అప్పటి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఆర్భాటంగా 'ఫిష్ ఆంధ్రా' కేంద్రాలను ప్రారంభించారు. కానీ ఆ తరువాత చేపలు, రొయ్యలు, పీతలు అందుబాటులో లేవంటూ ప్రభుత్వం చేతులెత్తేసింది. ప్రభుత్వం నుంచి సబ్సిడీ సొమ్ము వచ్చేవరకు 'ఫిష్ ఆంధ్రా' యూనిట్లను నడిపిన లబ్ధిదారులు.. తరువాత వాటిని మూసివేశారు. కాగా యూనిట్లు ఏర్పాటు చేసిన వారిలో కొందరికి మాత్రమే సబ్సిడీ వచ్చిందని, మిగిలిన వారికి సబ్సిడీ సొమ్ములు అందలేదని తెలిసింది. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో 19 'ఫిష్ ఆంధ్రా' అవుట్‌లెట్లు ప్రారంభించగా, ప్రస్తుతం ఒక్కటి కూడా వినియోగంలో లేదు.



చోడవరం శివారు నరసయ్యపేట వద్ద ఏర్పాటు చేసిన 'ఫిష్ ఆంధ్రా' అవుట్‌లెట్

సిందూర అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు



సిందూర అలంకరణలో విఘ్నేశ్వరుడు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన మంగళవారం చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడు సిందూరం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి సిందూర అలంకరణలో స్వామిని ముస్తాబు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. -చోడవరం

భారీ వర్షాలతో రోడ్లు ఛిద్రం



అచ్యుతాపురం- పూడిమడక రోడ్డులో మైలురాయి వంతెన వద్ద గోతులమయమైన రోడ్డు



అచ్యుతాపురం- మార్టూరు రోడ్డులో ఏర్పడిన భారీ గొయ్యి

- అచ్యుతాపురం సెజ్ రహదారుల్లో అడుగడుగునా గోతులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

అచ్యుతాపురం, సెప్టెంబరు 10: గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మండలంలో పలు రహదారులు ఛిద్రమయ్యాయి. ముఖ్యంగా సెజ్ కర్మాగారాలకు వెళ్లే రహదారిలో భారీ గోతులు ఏర్పడి అధ్వానంగా తయారైంది. అచ్యుతాపురం- పూడిమడక రహదారిలో మైలురాయి వంతెన వద్ద రెండు అడుగుల లోతున గొయ్యిలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. దుప్పితూరు వద్ద సుమారు 500 మీటర్ల మేర అడుగో గొయ్యి వుంది. ద్విచక్ర వాహనదారులు కూడా గోతులను తప్పించుకునే వీలులేకుండా వుంది. ఇంకా బ్రాండిక్స్ ముఖద్వారం, ఏషియన్ పెయింట్స్, ఎమెరీస్ కర్మాగారాం, లాలం కోడూరు జంక్షన్ వద్ద కూడా రోడ్డు కొట్టుకుపోయింది. అచ్యుతాపురం- మార్టూరు రోడ్డులో మార్టూరు నూకాలమ్మ ఆలయం, సెజ్ పునరావాస కాలనీ ముఖద్వారం వద్ద భారీ గుంతలు పడ్డాయి. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దు



నెహ్రూచౌక్ సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకుల ఆందోళన

విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ప్రైవేటు పరం చేయొద్దని, సొంత గనులు కేటాయించడంతోపాటు నిర్వహణ మూలధనం సమకూర్చాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపుతో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనకాపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. - వార్త 7వ పేజీలో...

సాక్షులను బెదిరించిన వ్యక్తి అరెస్టు

పాడేరురూరల్, సెప్టెంబరు 10: హత్య కేసులో అరెస్టు అయి ఇటీవల బెయిల్‌పై వచ్చి.. సాక్షులను బెదిరిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ దీనబంధు తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దల్లాపల్లి పంచాయతీ బూరుగుచట్టు గ్రామానికి చెందిన బుల్లిబాబు అనే వ్యక్తి 2019లో జరిగిన హత్య కేసులో జైలుకు వెళ్లాడు. ఇటీవల బెయిల్‌పై వచ్చిన ఆయన గ్రామంలో ఉన్న సాక్షులు సత్యారావు, కృష్ణలను బెదిరింపులకు గురి చేశాడు. దీంతో సాక్షులు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈ ఫిర్యాదుపై గ్రామంలో సీఐ విచారణ చేశారు. ఈమేరకు బుల్లిబాబును అరెస్టు చేసి, విశాఖ సెంట్రల్ జైలుకు తరలించామని సీఐ దీనబంధు తెలిపారు.

ఇద్దరికి ఏడాది జైలు

కొత్తూరు, సెప్టెంబరు 10: నేరం రుజువు కావడంతో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ 10వ అడిషనల్ కోర్టు జడ్జి ఎస్.శ్రీవిద్య మంగళవారం తీర్పు ఇచ్చారని అనకాపల్లి రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో 2017 ఆగస్టు 25న గొడవ జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు అప్పటి అనకాపల్లి రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న ఆదినారాయణరెడ్డి వెళ్లారు. అక్కడ అదే గ్రామానికి చెందిన గూనూరు కనకఅప్పలరాజు, పులికాల కిరణ్‌కుమార్ పోలీసులపై దాడి చేయగా.. వారిరువురిపై కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులు కోర్టులో చార్జిషీటు వేశారు. 2022లో 13వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఇద్దరి నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధించింది. దీనిని సవాల్ చేస్తూ వారు పదవ ఏడీజే కోర్టుకు వెళ్లారు. అక్కడ విచారణ అనంతరం న్యాయమూర్తి శ్రీవిద్య ఏడాది శిక్షను ఖరారు చేస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారని సీఐ రవికుమార్ చెప్పారు.

చట్రాపల్లి ఘటనపై కేసు

▸▸ **కుమారి మృతదేహానికి పోస్టుమార్టం**



గ్రామస్థుల నుంచి వివరాలను సేకరిస్తున్న సీలేరు ఎస్ఐ రామకృష్ణ

సీలేరు, సెప్టెంబరు 10 : జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో కొండచరియలు విరిగిపడిన సంఘటనలో మృతి చెందిన కొర్రా కుమారి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించినట్టు సీలేరు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి కొండచరియలు విరిగిపడి బురదలో కూరుకుపోయి కుమారి మృతి చెందినట్టు గ్రామస్థులు, బంధువులు తెలిపారన్నారు. ఈ సంఘటనలో గాయపడిన ముగ్గురుతోపాటు 60 నుంచి 70 మేకలు మృతి చెందాయని, మూడిళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కుమారి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు. అలాగే గ్రామంలో ఉన్న మిగతా వారిని సప్పర్లలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. సీలేరు-జీకేవీధి మధ్య రహదారిపై పేరుకుపోయిన మట్టిదిబ్బలు, చెట్లను ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగిస్తున్నట్టు చెప్పారు.

పాఠశాలల రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

▸▸ **విశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు విజయభాస్కర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

కశింకోట, సెప్టెంబరు 10 : పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా అమలు చేయాలని విశాఖ జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు విజయభాస్కర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో జిల్లాలో ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషనర్ స్థాయి అధికారులు పాఠశాలలను సందర్శించినప్పుడు పూర్తి వివరాలను ఒక ఫార్మెట్‌లో తయారు చేసి సమర్పించాలన్నారు. అలాగే సర్దుబాటు చేసిన సమయంలో ఉపాధ్యాయుల బయోమెట్రిక్ అటెండెన్స్‌ను ట్యాగ్ చేసిన పాఠశాలలకు కమిషనర్, పాఠశాల విద్యాశాఖ బదిలీ చేయడం జరిగిందని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ప్రణాళికబద్ధంగా అమలు చేయాలన్నారు. పాఠశాల కాంప్లెక్స్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ నిబంధనలకు అనుగుణంగా చేయాలన్నారు. మండలానికి 4 నుంచి 5 కాంప్లెక్స్ కేంద్రాలు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. యుడైస్ ప్లస్ 2024-25 డాటా కాప్చర్ ఫార్మెట్‌లో పాఠశాల యాజమాన్య, కేటగిరి, దిగువ, ఎగువ తరగతులకు సంబంధించి సరైన సమాచారం కచ్చితంగా నింపాలన్నారు. సమావేశంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో అప్పారావు, ఎఎస్‌వో ఎంఎస్. ప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురద చల్లితే సహించం

▸▸ **మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు**



తుమ్మపాల, సెప్టెంబరు 10 : రాష్ట్రప్రభుత్వంపై వైసీపీ నాయకులు బురద చల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బుడమేరు వాగు గట్లపై మట్టిని రూ.500 కోట్లకు అమ్ముకున్న ఘనత వైసీపీ నాయకులదేనన్నారు. కాలువను ఆనుకుని ఏడు కిలోమీటర్ల మేర భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు. విజయవాడ బాధితుల పట్ల ఆ పార్టీ నాయకులకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. గత ఎన్నికల్లో వైసీపీ నాయకుల ఆగడాలను తట్టుకో లేక ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ వారి తీరు మారకపోవడం దారుణమన్నారు. గుడివాడ అమర్‌నాథ్ నోరు అదుపులో పెట్టుకోవాలని.. లేదంటే అతని అక్రమాల చిట్టా బయట పెట్టాల్సి వస్తుందని బుద్ద హెచ్చరించారు.

పెందుర్తిలో జాబ్ మేళా రేపు

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 12న పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారి సాయి కృష్ణ చైతన్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి తెలిపారు. ఫైజర్ కంపెనీ, హెటిరో ల్యాబ్, కేఎల్ గ్రూప్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ బీఎస్సీ కెమిస్ట్రీ, ఐటీఐ ఫిట్టర్, డిప్లమో ఇన్ ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 99487 68778 నంబరులో సంప్రదించాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు గురువారం ఉదయం 9 గంటలకు పాలిటెక్నిక్ కాలేజీలో స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

సింహాద్రి నాల్గో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, సెప్టెంబరు 10 : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాల్గో యూనిట్‌లో ఉత్పత్తిని సోమవారం అర్ధరాత్రి పునరుద్ధరించారు. ఇదే యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆదివారం ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లో అన్ని యూనిట్‌లోనూ ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	89.00
లైవ్ ధర	109.00
విత్ స్కిన్	188.00
స్కిన్ లెస్	198.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

నిండుకుండలా కల్యాణపులోవ

రిజర్వాయర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

రావికమతం, సెప్టెంబరు 10: మండలంలో కల్యాణపులోవ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతున్నది. రిజర్వాయర్ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు కొండ గెడ్డల ద్వారా నీరు వచ్చి చేరుతున్నది. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా మంగళవారం నాటికి ఇన్‌ఫ్లో 25 క్యూసెక్కులు మాత్రమే ఉంది. రిజర్వాయర్‌లో నీటి మట్టం 458.7 అడుగులకు చేరి నిలకడగా ఉండడంతో గేట్లు మూసివేసినట్టు జేఈ సత్యనారాయణ దొర తెలిపారు. దీంతో కొత్తనీటితో జలాశయం నిండు కుండలా తొణుకుతూ చూపరులను కనువిందు చేస్తోంది.



నిండుకుండలా తొణికిసలాడుతున్న కల్యాణపులోవ రిజర్వాయర్

పెరిగిన రైవాడ నీటి మట్టం

దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయ నీటి మట్టం 111.80 మీటర్లకు చేరింది. జలాశయ గరిష్ఠ నీటి మట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం జలాశయంలోకి వెయ్యి క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. సోమవారం 111.5 మీటర్లు కాగా మంగళవారానికి 111.80 మీటర్లకు చేరింది. విశాఖ నగరపాలక సంస్థకు 50 క్యూసెక్కులు, ఆయకట్టుకు వంద క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు.



రైవాడ జలాశయ గేట్లు వద్ద చేరిన నీరు

పెద్దేరు నుంచి 559 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్ : మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో మంగళవారం ఒక గేటు తెరిచి 559 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా భారీ వర్షాల కారణంగా ఇన్‌ఫ్లో 1309 క్యూసెక్కులు వస్తుండడంతో 136.35 మీటర్లకు చేరింది. దీంతో అప్రమత్తమై మూడో గేటు తెరిచి 559 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్టు ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు.

పాయకరావుపేటకు తప్పిన ముప్పు



భూమి ఆనకట్ట వద్ద తగ్గిన తాండవ నది ఉధృతి



చాకలిపేటలో వరద బాధితులకు భోజనం అందజేస్తున్న దృశ్యం

▸▸ **నదిలో తగ్గుతున్న నీటి ప్రవాహం**

▸▸ **ఊపిరిపీల్చుకున్న పట్టణ ప్రజలు**

▸▸ **వరద బాధితులకు అధికారులు భోజనం సరఫరా**

పాయకరావుపేట, సెప్టెంబరు 10 : పాయకరావుపేట వద్ద ఉధృతంగా ప్రవహించిన తాండవ నది మంగళవారం శాంతించడంతో పట్టణంలో లోతట్టు ప్రాంతాలకు ముప్పు తప్పింది. కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండడంతోపాటు తాండవ జలాశయం నుంచి నదిలోకి 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో సోమవారం అర్ధరాత్రికి పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాండురంగస్వామి ఆలయం వెనుక తాండవ నదిని ఆనుకుని ఏటి ఒడ్డువీధి, చాకలిపేట, తోకలవారి వీధి, పార్కువీధి తదితర ప్రాంతాల్లోకి నీరు చేరింది. దీంతో అధికారులు ముందస్తు చర్యగా స్థానిక పాండురంగస్వామి కల్యాణ మండపంలో పునరావాస కేంద్రం ఏర్పాటుచేశారు. అయితే మంగళవారం ఉదయానికి నదిలో నీటి ప్రవాహం తగ్గుతుండడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణంలో వరద నీరుచేరిన లోతట్టు ప్రాంతాల్లోని సుమారు 200 మందికి రెవెన్యూ అధికారులు మధ్యాహ్న భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జయప్రకాష్ టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరాహా నది ఉధృతి

కోటవురట్ల, సెప్టెంబరు 10: ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో మండలంలోని పాతరోడ్డు వద్ద సర్పా, వరాహా నదుల ఉధృతి కొనసాగుతోంది. నర్సీపట్నంలోని రావణాపల్లి, రావికమతం మండలం కల్యాణపులోవ రిజర్వాయర్ల నుంచి నీరు అధికంగా ఉండడంతో మూడు రోజుల నుంచి వరాహా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వరాహా నదిలో నీరు పుష్కలంగా ఉండడంతో ఖరీఫ్ పంటలకు సాగు నీరు ఢోకా లేదని రైతులు అంటున్నారు. మూడు రోజుల నుంచి వరాహా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పందూరు, రాజుపేట గ్రామాలకు రాకపోకలు అంతరాయం కలిగింది.



గొట్టివాడ ఘాట్ రోడ్డు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరాహా నది

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

▸▸ **జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్. పక్కన జేసీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10: క్రీడలతోనే మానసిక ఉల్లాసం పొందవచ్చని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పోర్ట్స్ ప్రాజెక్టలపై సమీక్షించారు. నక్కపల్లిలో హాకీ మినీ గ్రౌండ్ ఏర్పాటు, పరవాడలో క్రికెట్ గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, వి.మాడుగులలో 200 మీటర్ల ట్రాక్ నిర్మాణం, వాలీబాల్ కోర్టు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేయించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. అదేవిధంగా రాంబిల్లి, అచ్యుతాపురం హైస్కూళ్లలో ప్లే ఫీల్డ్ డెవలప్‌మెంట్ పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, క్రీడాధికారులు పాల్గొన్నారు.

ఎస్ఈజడ్‌లో ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ **జిల్లా ఎస్పీ దీపిక**



రాంబిల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ దీపిక

రాంబిల్లి, సెప్టెంబరు 10: ఎస్ఈజడ్‌లోని పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అన్నారు. మంగళవారం ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు. తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. స్థానిక మత్స్యకారులతో కలిసి కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. గంజాయి రవాణా అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చూడాలన్నారు. ఈనెల 14న జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా రాజీ పడదగ్గ కేసులలో ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ కేవీ.సత్యనారాయణ, సీఐ సీహెచ్ నర్సింగరావు, ఎస్ఐ కె. రమణ పాల్గొన్నారు.

కారిపోతున్న సీహెచ్‌సీ భవనం

▸▸ **ఏడాది కాకుండానే ఈ దుస్థితి**

▸▸ **నిర్మాణంలో లోపమే కారణమంటున్న రోగులు**

▸▸ **అధికారులు, పాలకులు నిర్లక్ష్యం**

ఎలమంచిలి, సెప్టెంబరు 10 : అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా పది కాలాలపాటు ఉండాల్సిన ప్రభుత్వ భవనం ఏడాది తిరగకుండానే వర్షాలకు కారిపోతున్నది. నాణ్యతను పాటించకుండా నిర్మించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ఉదాహరణగా స్థానిక సీహెచ్‌సీ నూతన భవనాన్ని పేర్కొనవచ్చు.

ఎలమంచిలి తులసీనగర్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్ల వ్యయంతో సీహెచ్‌సీకి నూతన భవనాన్ని నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఏడాది క్రితం నూతన సీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించారు. నాటి నుంచి అరకొర వసతుల మధ్య సీహెచ్‌సీలో వైద్య సేవలను సిబ్బంది అందిస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆస్పత్రిలోని వైద్యుల గదితోపాటు పేషెంట్లు వైద్య సేవలు పొందే వార్డు కూడా కారిపోతున్నది. ఈ నీరు ఆస్పత్రి ఆవరణంతా తడిసిపోకుండా సిబ్బంది లీకవుతున్న చోట బకెట్ పెట్టారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన ఆస్పతి భవనాలు ఏడాది తిరగకుండానే కారిపోవడం, లీకవడం పట్ల స్థానికులు, రోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భవనాల నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నూతన సీహెచ్‌సీ భవనంలో వర్షం నీరు లీకవుతుండడంతో బకెట్ పెట్టిన సిబ్బంది

నీట మునిగిన వరి పొలాల పరిశీలన



నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం

నక్కపల్లి, సెప్టెంబరు 10: మండలంలోని గొడిచెర్ల, దేవవరం, నామవరం, గునిపూడి గ్రామాల్లో తుఫాన్ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భవానీ, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.ప్రసాదరావు, పాయకరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు ఉమా ప్రసాద్ నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. నీరు బయటకు పోయే చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ పొటాష్ వేయాలని సూచించారు. అధిక తేమ వల్ల పాముపొడ తెగులు ఆశించే అవకాశం వుందని చెప్పారు. దీని నివారణకు ఏం చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయరాదంటూ కార్మిక సంఘాలు రాస్తారోకో



నెహ్రూచౌక్ వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్మిక సంఘాలు, రైతు సంఘాలు మంగళవారం స్థానిక నెహ్రూచౌక్‌లో రాస్తారోకో నిర్వహించాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ప్రదర్శనగా నెహ్రూచౌక్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ప్రజలంతా ఐక్యంగా కలిసి పోరాడాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి చేస్తున్నారని, తర్వాత నిర్వీర్యం చేస్తారన్నారు. టీడీపీ నాయకత్వం కేంద్రంలోని బీజేపీపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శులు ఆర్.దొరబాబు, వైఎన్ భద్రం, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, ఐద్వా జిల్లా ప్రధానకార్యదర్శి డీడీ వరలక్ష్మి, వీవీ శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి అప్పన్న ఆలయంలో పవిత్రోత్సవాలు



పవిత్రాలతో ఈఓ, ఆలయ అధికారులు

సింహాచలం, సెప్టెంబరు 10: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవాలలో భాగమైన పవిత్రోత్సవాలను ఈనెల 13 నుంచి 17వ తేదీవరకు నిర్వహించనున్నట్టు ఈవో సింగాల శ్రీనివాసమూర్తి తెలిపారు. 13న రాత్రి ఏడు గంటలకు పుట్టమన్ను మండపంలో అంకురార్పణ, రుత్విక్‌వరణలతో శ్రీకారం చుడతారు. అదేరోజు యాగశాలార్చన, యాగశాల ప్రవేశం, మృత్స్యగ్రహణం ఉంటాయి. 14న ఉదయం పవిత్రాధివాసం, చక్రాబ్జమండల రచన, ఆవాహనం, పవిత్రప్రతిష్ఠలు, 15న రాత్రి పవిత్ర సమర్పణ, 16న ఉదయం పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, రథబలి, 17న ఉదయం ఏకాంత స్నపన తిరుమంజనంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ఆయా రోజుల్లో అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేశామని, రాత్రి ఏడు గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

భువనేశ్వర్ చేరే రైళ్ల వేళల్లో తాత్కాలిక మార్పులు

విశాఖపట్నం, సెప్టెంబరు 10: టెర్మినల్ పరిమితుల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి భువనేశ్వర్ చేరే పలు రైళ్ల వేళలను తాత్కాలికంగా సవరించినట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. వీటిలో ఈ నెల 19న పుణే-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22881) సాయంత్రం 5.00 గంటలకు, 20వ తేదీన చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12829) ఉదయం 6.10 గంటలకు, 22వ తేదీన సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016) మధ్యాహ్నం 3.40 గంటలకు, తిరుపతి-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22880) ఉదయం 6.10 గంటలకు, ఈ నెల 23న తిరుపతి-భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22872) ఉదయం 6.10 గంటలకు చేరే విధంగా వేళలు సవరించామని పేర్కొన్నారు.

ఫార్మా పునరావాస కాలనీలో పార్కు ప్రారంభం


పార్కు ప్రారంభిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, సెప్టెంబరు 10 : ఈ.బోనంగి పంచాయతీ పరిధి ఫార్మా పునరావాస కాలనీలో పంచాయతీ నిధులు రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన ఉద్యానవనాన్ని సోమవారం రాత్రి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు సేద తీరేందుకు ఉద్యానవనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉద్యానవనంలో పిల్లలు, పెద్దలకు ఏర్పాటు చేసిన పరికరాలను సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ బొద్దపు శ్రీనివాసకాసులు, మాజీ సర్పంచ్ అట్టా సన్యాసిఅప్పారావు, స్థానిక నాయకులు బుగిడి రామగోవిందరావు, మంత్రి గిరిప్రసాద్, మేడిశెట్టి వెంకటరావు, బొద్దపు వెంకటరమణతో పాటు మండలంలో గల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నాబార్డు సహాయం


సరుకులు తీసుకెళుతున్న వ్యాన్ వద్ద జోగినాయుడు, పోలీసులు

తుమ్మపాల, సెప్టెంబరు 10 : విజయవాడ వరద బాధితులకు నాబార్డు వారి ప్రోత్సాహంతో సుమారు లక్ష రూపాయల విలువైన సరుకులను మంగళవారం ఎస్‌వీడీఎస్ కార్యదర్శి కర్రి జోగినాయుడు అందించారు. ఈ సందర్భంగా తుమ్మపాలలో గల ఎస్‌వీడీఎస్ కార్యాలయం వద్ద సరుకుల వ్యాన్‌కు పచ్చజెండా ఊపి పంపించారు. ఎస్‌వీడీఎస్ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు జోగినాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అప్పారావు, పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ, ఎస్‌వీడీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.20 వేలు పలికిన వినాయకుడి లడ్డూ


బండారు శ్రీనివాసరావుకు లడ్డూ అందజేస్తున్న పైలా శ్రీనివాస్

పరవాడ, సెప్టెంబరు 10 : మండల కేంద్రంలో బొంకులదిబ్బ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిద్ధి వినాయక మహోత్సవాల్లో వినాయకుడికి నైవేద్యంగా సమర్పించిన 135 కిలోల లడ్డూ ప్రసాదానికి మంగళవారం రాత్రి వేలం నిర్వహించారు. గాజువాక ప్రాంతానికి చెందిన బండారు శ్రీనివాసరావు రూ. 20 వేలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం పాటదారునికి వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు చేతుల మీదుగా లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, బండారు రామారావు, పైలా పోతునాయుడు, పైలా అప్పలనాయుడు, బొంకులదిబ్బ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పైలా పైడంనాయుడు, చీపురుపల్లి శ్రీనివాసరావు, పైలా హరీష్, గండి మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎల్వీ రమణ

తుమ్మపాల, సెప్టెంబరు 10 : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దిబ్బపాలెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి వైద్యులు ఎల్వీ రమణ నేత్ర పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులకు మందులు, కళ్లద్దాలను పంపిణీ చేశారు. కంటి వ్యాధులు, కళ్ల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు బీవీ లక్ష్మి, షేక్ మదీనా, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి

▸▸ సీఐ స్వామినాయుడు



కశింకోట, సెప్టెంబరు 10 : వినాయక నిమజ్జనోత్సవాల్లో భాగంగా అనుప మహోత్సవాల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు తప్పవని సీఐ అల్లు స్వామినాయుడు హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసిన వినాయక మండల పాల వద్ద విద్యుత్ చౌర్యం చేసినట్లు తెలిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీజే వంటివి ఏర్పాటు చేయాల్సి వస్తే పోలీసుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. వీటికి రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. పోలీసులకు నిర్వాహకులు, యువత సహకరించి ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రులు, నిమజ్జనోత్సవాలు చేపట్టాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

▸▸ సీఐటీయూ డిమాండ్
▸▸ పలు చోట్ల రాస్తారోకో



పరవాడలో ఆందోళన చేపడుతున్న సీఐటీయూ నాయకులు

పరవాడ, సెప్టెంబరు 10 : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనంచేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో లంకెలపాలెం నుంచి పరవాడకు వెళ్లే మెయిన్‌రోడ్డులో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థ అయిన స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటానికి తమవంతు కృషి చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, పూర్తి సామర్థ్యంతో నడపాలని కోరారు. 52 మంది ప్రాణత్యాగం చేసి సాధించిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.రమణ, ఎస్.అప్పారావు, రామారావు, నరసింగరావు, చిన్నారావు పాల్గొన్నారు.

కశింకోట : విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోరుతూ పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. స్థానిక నాలుగురోడ్ల కూడలిలో మానవహారంగా చేపట్టి స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి తదితరులు మాట్లాడుతూ కేవలం రూ.9 వేల కోట్లతో స్థాపించిన స్టీల్‌ప్లాంట్ నేటికి రూ.లక్షల కోట్లు ఆస్తులు కలిగి ఉందన్నారు. అటువంటి స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణను చేస్తే చూస్తూ ఊరేకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండబాబు, రామోజీ, దేవుడు, అబ్బులు, లక్ష్మణ, లక్ష్మి, రాణి, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ముంపు పొలాల్లో దిగి రైతుల అభ్యర్థన


రాజుకోడూరు వద్ద ముంపునకు గురైన వరిపొలాల్లో దిగిన రైతులు

రాంబిల్లి, సెప్టెంబరు 10 : భారీ వర్షాలకు వరిపొలాలు ముంపునకు గురై దెబ్బ తిన్నాయని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మండలంలోని రాజుకోడూరుకు చెందిన రైతులు మంగళవారం ముంపునకు గురైన వరిపొలాల్లో దిగి అభ్యర్థించారు. వాతావరణం అనుకూలించడంతో ఎకరాకు సుమారు రూ.25 వేలు వరకు పెట్టుబడులు పెట్టి నాట్లు వేశామని, 40 రోజులు కలిగి ఉన్న వరి పంట వర్షాల తాకిడికి ముంపునకు గురైన పొలాలు చెరువులను తలపించే విధంగా తయారయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వరి రైతులను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రావి చిరంజీవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

జల దిగ్బంధంలోనే పూడిమడక


చెరువు కాదు.. పూడమడక ఉప్పు గల్లీలు

అచ్యుతాపురం, సెప్టెంబరు 10 : వర్షాలు తగ్గినా వరద నీరు మాత్రం తగ్గలేదు. ముఖ్యంగా పూడిమడక చుట్టూ ఉన్న ఉప్పు గల్లీల్లో వరద నీరు నిలిచిపోయింది. ప్రస్తుతం పూడిమడకకు వెళ్లే రోడ్డు మినహా గ్రామం చుట్టూ వర్షపు నీరే ఉంది. పూడిమడక తూర్పున సముద్రం ఉంది. అయితే ఉప్పుటేరు కారణంగా గ్రామానికి పడమర, ఉత్తర, దక్షిణ దిశల్లో ఉన్న ఉప్పు మడుల్లో భారీగా నీరు చేరింది. ఉప్పుటేరులో ప్రవహించే సముద్రపు నీటికి భారీగా వర్షపు నీరు కూడా చేరటంతో పూడిమడక గ్రామం చుట్టూ జలమయమైంది. పోటు సమయంలో ఉప్పుటేరులో నీరు సముద్రంలో కలిసినా, ఉప్పుటేరు కన్నా ఎత్తులో ఉన్న ఉప్పుగల్లీల్లో నీరు మాత్రం అలాగే ఉండిపోయింది. దీంతో పూడిమడక ప్రస్తుతం జలదిగ్బంధంలో ఉండిపోయింది. దీంతో సీజనల్, అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పల్లపు ప్రాంతాలైన హరిపాలెం, కొండకర్ల, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, పెదపాడు, మల్లవరం, ఎర్రవరం, మల్లవరం, ఎంజేపురం పరిసర ప్రాంతాల్లో వరి, చెరకు పొలాల్లో కొద్దిపాటి నీరు చేరింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లదని అధికారులు అంటున్నారు. కేవలం 25 ఎకరాల వరి పొలాలు మాత్రమే నీట మునిగాయని అధికారులు తెలిపారు.

మెడికల్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన


ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 : ఎన్టీఆర్ వైద్యాలయం, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరుతూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేద రోగులకు సేవలు చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ల సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రతీ నెలా జీతాలు సక్రమంగా ఇవ్వకుండా వర్కర్ల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని లక్ష్మణ మండిపడ్డారు. కార్మికులందరికీ బకాయిలు చెల్లించాలని, ప్రతి నెలా 15 లోగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవో ప్రకారం కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించకపోతే ఈ నెల 15 నుంచి విధులు బహిష్కరించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.సంతోష్, ఎ.ప్రసాద్, నూకరాజు, సుధీర్, వరలక్ష్మి, కృష్ణశివ పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం

▸▸ సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వాసంతి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పాల్గొన్న డా.వాసంతి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 10 : యోగ, మెడిటేషన్ ద్వారా మానసిక ఒత్తిడి నుంచి దూరంగా ఉండవచ్చని సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాసంతి అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని సైతారుపేట గ్రామంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసంతి మాట్లాడుతూ ఆత్మహత్యలు వంటి వాటికి పాల్పడటం చట్టరీత్యా నేరమని, మానసిక ఒత్తిడికి సంబంధించిన విషయాల నుంచి యోగా, మెడిటేషన్ వంటి ద్వారా తమ దృష్టిని మళ్లించి వేరే విషయాలపై కేంద్రీకరించడం వలన మానసిక ఒత్తిడికి దూరంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని విద్యార్థులకు సూచించారు. అలాగే చెడు ఆలోచనలు వస్తున్న వారు మానసిక వైద్య నిపుణలను సంప్రదించి వారి సలహాలు, సూచనలు పాటించాలని వాసంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లీనిక్ క్లస్టర్ పర్యవేక్షకుడు డాక్టర్ పిఎన్‌విఎస్ ప్రసాద్, సిబ్బంది వై అనూష, వేణు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంపులోనే పొలాలు

... 5వ పేజీ తరువాయి

ప్రాథమికంగా అంచనావేశారు.

రావికమతం మండలంలోని దొండపూడి, పి.పొన్నవోలు, మేడివాడ, గర్నికం, డిడ్డి, బాధనపాడు, పెదపాచిల తదితర గ్రామాల్లో 22.6 హెక్టారుల్లో వరి పంట ముంపునకు గురైంది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రాథమికంగా అంచనా వేశారు.

మేజర్, మైనర్ శారదా నదుల్లో తగ్గని వరద

▸▸ ముంపు నుంచి తేరుకోని వరి పొలాలు

రాంబిల్లి : వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తోడు, ఎగువ ప్రాంతాల్లో నుంచి రాంబిల్లి మండలం మీదుగా పయనించే మేజర్, మైనర్ శారదా నదులు గత మూడు రోజుల నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రమాదకరస్థాయిలో వరద ప్రవహిస్తుండడంతో బలహీనంగా ఉన్న నదుల గట్లకు గండ్లు పడే ప్రమాదం వుందని పలు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం వర్షం కురవనప్పటికీ మైనర్, మేజర్ శారదా నదుల్లో వరద ఉధృతి తగ్గలేదు. కొప్పుగొండుపాలెం, పెదకలవలాపల్లి, వెల్చూరు, రాజుకోడూరు, పంచదార్ల, మర్రిపాలెం, కట్టుబోలు, కుమ్మరాపల్లి, రజాలఅగ్రహారం తదితర గ్రామాల పరిధిలో వరి పొలాలు మూడు రోజుల నుంచి ముంపులోనే ఉన్నాయి. మండలంలో 124 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైనట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న అయోధ్య రామ వినాయకుడు


అలరిస్తున్న 13 అడుగుల ఎత్తు అయోధ్యరామ వినాయకుడు

ఎలమంచిలి, సెప్టెంబరు 10 : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంటున్నాయి. రైల్వే స్టేషన్ రోడ్డు, కొత్తపేట, నాగేంద్రకాలనీ, దిమిలి రోడ్డు జంక్షన్, కాకివాని వీధి, తులసీనగర్‌లతో పాటు పలు వార్డుల్లో వినాయక విగ్రహాలు విశేషంగా ఏర్పాటు చేశారు. కొత్తపేట చినరామాలయం వీధిలో ప్రతి ఏటా మాదిరే ఈ ఏడాది 13 అడుగుల ఎత్తులో అయోధ్య రామ వినాయకుడి రూపంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహంతో పాటు ఆలయాన్ని తలపించేలా వేసిన సెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చేతిలో శ్రీరాముని విల్లు పట్టుకునేలా వినాయకుడి విగ్రహం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఈ మండపానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

యాజమాన్య పద్ధతులతో పంటల పరిరక్షణ

▸▸ అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సరిత


రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

పరవాడ (సబ్బవరం), సెప్టెంబరు 10 : రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల వరదలకు నీట మునిగిన వరి పంటను కాపాడుకోవచ్చని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. సరిత సూచించారు. నీట మునిగిన పంట పొలాలను శాస్త్రవేత్తల బృందం మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ముంపునకు గురైన వరి పొలాల్లో వెంటనే నీటిని బటయకు తీసి ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను పై పాటుగా వేసుకోవడం వలన పంట త్వరగా పుంజుకుంటుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తెగుళ్ల నివారణకు రెండు గ్రాముల కార్బెండిజమ్, మోనోజెబ్ శిలీంద్ర మందును పిచికారి చేయడం వలన తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, సహాయకులు లావణ్య, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, రైతులు జగ్గారావు, రమణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

దెబ్బ తిన్న ఇళ్లు పరిశీలించిన కూటమి నేతలు


ఇళ్లను పరిశీలిస్తున్న కూటమి నేతలు

కశింకోట, సెప్టెంబరు 10 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాళ్లపాలెంలో దెబ్బతిన్న ఇంటిని కూటమి నేతలు మంగళవారం పరిశీలించారు. బాధితులు కోన దేముళ్ళు, కోన నూకునాయుడు ఇళ్ళను పరిశీలించి ప్రభుత్వం నుంచి తక్షణ సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఏపైై గృహాలు మంజూరు అయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు కాయల మురళీధర్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

... 5వ పేజీ తరువాయి

కారణంగా జిల్లాలో 40 ఇళ్లు దెబ్బతిన్నాయని, రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి సుమారు 80 కిలోమీటర్ల మేరకు రహదారులు పాడయ్యాయని వివరించారు. వరద ఉధృతికి దెబ్బతిన్న కల్వర్టులను పునరుద్ధరిస్తున్నామని, జిల్లాలో ఐదు ప్రధాన రిజర్వాయర్లు ఉండగా రైవాడ మినహా మిగిలిన రిజర్వాయర్లు నిండడంతో అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో విద్యుత్ శాఖకు సంబంధించి 33 కేవీ ఫీడర్లకు ఎటువంటి నష్టం జరగలేదని, 11 కేవీ ఫీడర్లకు మాత్రం కొంత మేరకు నష్టం జరిగిందన్నారు. వివిధ ప్రాంతాల్లో 48 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, వీటిని 24 గంటల్లో పునరుద్ధరించామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్ఓ బి.దయానిధి, డీఆర్‌డీఏ, బీసీ కార్పొరేషన్, గృహ నిర్మాణ, పౌరసరఫరాలు, వైద్య ఆరోగ్య, మత్స్యకార, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, ఈపీడీసీఎల్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్నిమాపక, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కారిడార్ పనులకు ఆటంకం వద్దు

▸▸ తహసీల్దార్ అంబేడ్కర్

నక్కపల్లి, సెప్టెంబరు 10 : మండలంలోని చందనాడ, బుచ్చిరాజుపేట, వేంపాడు, రాజయ్యపేట, డీఎల్‌పురం గ్రామాల్లో ఏపీఐఐసీ పారిశ్రామిక వాడల నిర్మాణం నిమిత్తం సేకరించిన భూములకు పరిహారం పూర్తిగా చెల్లించినట్టు నక్కపల్లి తహసీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ భూముల్లో ప్రభుత్వం ద్వారా కాంట్రాక్ట్ పొందిన సంస్థలు పనులు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ ద్వారా అనుమతులు పొందినట్టు తెలిపారు. అందువల్ల కారిడార్ భూముల్లో జరిగే పనులకు లేదా ఇతర యంత్రాలకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

18 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

పరవాడ, సెప్టెంబరు 10 : భారతీయ జనతా పార్టీలో సభ్యత్వం పొందేందుకు యువతతో పాటు అన్ని వర్గాల వారు ముందుకు రావాలని పి.బోనంగి సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు 18 నుంచి 25 ఏళ్ల వయసు ఉన్న వారంతా పార్టీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు ఫోన్ : 88000 02024 కు మిస్డ్‌కాల్ ఇవ్వడం ద్వారా పార్టీ సభ్యత్వం పొందవచ్చన్నారు. యువకులంతా విరివిగా పార్టీ సభ్యత్వం తీసుకోవాలని ఆమె కోరారు.

తోట నగేష్‌కు సన్మానం


నగేశ్‌కు సన్మానిస్తున్న శివదత్ తదితరులు

పాయకరావుపేట, సెప్టెంబరు 10 : ఎన్నో సేవా కార్యక్రమాలతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్‌కు జాతీయ స్థాయిలో సేవా సామ్రాట్ అవార్డు రావడం అభినందనీయమని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ అన్నారు. ఇటీవల ఢిల్లీకి చెందిన ఆదిలీల ఫౌండేషన్ సంస్థ నుంచి తోట నగేశ్ జాతీయ స్థాయిలో సేవా సామ్రాట్ అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం పాయకరావుపేటలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నిర్వాసిత రైతులకు న్యాయం చేయండి

నక్కపల్లి, సెప్టెంబరు 10 : విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన నిర్వాసిత రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా పనులు ఎలా చేస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ప్రశ్నించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కారిడార్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా పనులు చేపడితే 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. గృహాలు తొలగించే వారికి ఎక్కడ పునరావాసం కల్పిస్తారు? ప్యాకేజీ ఎంతిస్తార ? 18 ఏళ్లు నిండిన వారికి ఏ ప్యాకేజీ ఇస్తారో ప్రకటించకుండా పనులు చేపట్టాలని ఆలోచించడం దారుణమన్నారు. ఈ పనులను ఆపకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అప్పలరాజు పేర్కొన్నారు.

జర్నలిస్టులు హెల్త్ కార్డు ప్రీమియం చెల్లించాలి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 10 : అక్రిడియేషన్ కలిగిన జర్నలిస్టులు హెల్త్ ఇన్సూరెన్స్‌కు చెల్లించాల్సిన ప్రీమియం రుసుం చెల్లించాలని డీపీఆర్వో కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబరు 31తో గడువు ముగిసే విధంగా గతేడాది అనకాపల్లి జిల్లా నుంచి 339 మంది జర్నలిస్టులకు అక్రిడియేషన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.

డిప్యూటీ డీఈవో జేవీ పాలెం స్కూలు సందర్శన

ఎస్.రాయవరం, సెప్టెంబరు 10 : మండలంలోని జేవీ పాలెం ఎంపీయూపీ పాఠశాలను మంగళవారం డిప్యూటీ డీఈవో పి.అప్పారావు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో చర్చించి పాఠశాల సమస్యలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి, అక్కడ తయారు చేసిన రాగి జావను విద్యార్థులతో పాటు తీసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు.

పొలాలను పరిశీలించిన అధికారులు


పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 10 : ఇటీవల పడిన భారీ వర్షాలకు పాయకరావుపేట మండలంలో నీట మునిగిన వరి పంట పొలాలను మంగళవారం అధికారులు పరిశీలించారు.

మండలంలోని గుంటపల్లి గ్రామంలో నీట మునిగిన వరి పంటను మండల వ్యవసాయాధికారి ఆదినారాయణ, జలవనరుల శాఖ ఏఈఈ శ్రీరామ్మూ తదితరులు పరిశీలించి నీట మునిగిన వరి పొలాల రైతులకు పంటను రక్షించుకోవడంపై అవగాహన కల్పించారు. వరి పంట పొలాల్లో ఉన్న నీరు బయటకు పోయిన తరువాత ఎకరాకి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ చల్లుకోవాలని ఏఓ ఆదినారాయణ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తోట సత్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యాధికారులు, సిబ్బంది

జీవో 85 రద్దుకు వైద్యుల డిమాండ్

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 10 : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 85ను రద్దు చేయాలని కోరుతూ కృష్ణాదేవిపేటలో వైద్యాధికారులు డాక్టర్ ఎస్.హరిప్రవీణ్, ఎస్.గాయత్రి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద ప్రభుత్వ వైద్యాధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీలో ప్రవేశాల్లో సీట్ల కేటాయింపును కుదిస్తూ జారీ చేసిన జీవో నంబర్ 85తో తమకు అన్యాయం జరుగుతుందన్నారు. క్లినిక్‌లో 15 శాతం సీట్లు, నాన్-క్లినిక్‌లో పని చేస్తున్న వారికి 30 శాతానికి కుదించటం అన్యాయమన్నారు. గతంలో నాన్-క్లినిక్‌లో పని చేసే వారికి 50 శాతం, క్లినిక్‌లో పని చేసే వారికి 30 శాతం ఉండేదన్నారు. ప్రస్తుత జీవోతో శాతాన్ని తగ్గించటంతో పాటు అనేక బ్రాంచ్‌లు ఉన్న వాటిని ఐదు బ్రాంచ్‌లుగా కుదించటం అన్యాయమన్నారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా 11, 12వ తేదీల్లో వైద్య సేవలకు అంతరాయం లేకుండా నిరసన కొనసాగిస్తామని, 13న అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలు నిలిపివేయనున్నట్టు చెప్పారు. 1న ఛలో విజయవాడ ర్యాలీ నిర్వహించి 16న పూర్తిస్థాయిలో నిరవధిక నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులకు వైద్య సిబ్బంది మద్దతు పలికారు.

14న జాతీయ లోక్ అదాలత్


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జస్టిస్ షియాజ్‌ఖాన్

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 10 : ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కోర్టు సముదాయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులు ఉంటే కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. దీనివల్ల వారికి డబ్బు, సమయం వృథా కాకుండా ఉంటుందని పేర్కొన్నారు.

ఇవేం 'మరుగు'దొడ్లు!

- తలుపులు పాడవడంతో క్లాత్ కట్టిన వైనం
- దారుణంగా సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ పరిస్థితి

నర్సీపట్నం, సెప్టెంబరు 10 : సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం-2 పరిస్థితి దారుణంగా మారింది. కనీస వసతులు కొరవడ్డాయి. మరుగుదొడ్లకు ఉన్న తలుపులకు పూర్తిగా తుప్పు పట్టడంతో పాడయ్యాయి. దీంతో తాత్కాలికంగా ఈ మరుగుదొడ్ల తలుపుల స్థానంలో క్లాత్ కట్టి తాత్కాలికంగా మరుగు కల్పించారు.

నర్సీపట్నం ఎస్సీ బాలుర వసతి గృహ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పై కప్పు నుంచి పెచ్చులు తరచూ ఊడి పడి పోతుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికి గదులన్నీ కారి పోయి విద్యార్థులకు కంటి మీద కునుకు ఉండటం లేదు. భవనం శ్లాబ్ తీసేసి కొత్తది వేస్తే గాని సమస్య పరిష్కారం కాదు. వసతి


నర్సీపట్నంలోని ఎస్సీ వసతిగృహం-2


తలుపు పాడవడంతో గ్రీన్ క్లాత్ కట్టిన దృశ్యం

గృహంలో 132 మంది విద్యార్థులకు కేవలం ఐదు గదులుఉన్నాయి. కిటికీ రెక్కలు, గుమ్మాలు, తలుపు కదిలి పోయి ఊడి పోయే పరిస్థితిలో ఉన్నాయి. కిటికి రెక్కలు లేకపోవడంతో గదిలోకి చలి గాలులు ప్రవేశించి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. హాస్టల్‌లో ఉన్న తొమ్మిది మరుగుదొడ్లకు నాలుగు శిథిలావస్థకు చేరాయి. మిగిలిన వాటికి తలుపులు లేకపోవడంతో సిబ్బంది తాత్కాలింగా గ్రీన్ క్లాత్ కట్టి మరుగు ఏర్పాటు చేశారు.

మండల మహిళా సమాఖ్య పాలకవర్గం ఎన్నిక


కార్యవర్గ ప్రతినిధులను అభినందిస్తున్న కరక సత్యనారాయణ

నాతవరం, సెప్టెంబరు 10 : నూతనంగా ఎన్నికైన మండల మహిళా సమాఖ్య పాలకవర్గం సభ్యులు వెలుగు ద్వారా ప్రభుత్వ పథకాలు సక్రమంగా మహిళలకు అందేటట్టు చూడాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మండల మహిళ సమాఖ్య నూతన సభ్యులతో కలసి మాట్లాడుతూ సభ్యులు సమన్వయంతో పని చేసి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం మండల మహిళ సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా కోరుబిల్లి మణి (ఎంబీ పట్నం) ఉపాధ్యక్షురాలిగా కాశీ విశాలాక్షి, (వెన్నలపాలెం), సెక్రటరీగా రేగటి దేవి (మాధవనగరం), కోశాధికారిగా పైల దేవి (గన్నవరం) జాయింట్ సెక్రటరీగా అప్పన్న వెంకట సీతాలక్ష్మి (చమ్మచింత)లను ఎన్నికయ్యారు. వీరిని మండల టీడీపీ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు అపిరెడ్డి మాణిక్యం, కొంగ్రు మరిడియ్య, మాజీ సర్పంచ్ వనిమిన సూర్యారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు శెట్టి నానాజీ, చింతకాయల ప్రశాంత్, బాపన్ననాయుడు, కిల్లాడ నూకరాజు, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు ఇనపసప్పల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 10 : గిరిజన, మైదాన ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది గర్భవతులకు కృష్ణాదేవిపేట పీహెచ్‌సీలో స్థానిక సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో పాలు, రొట్టెలు తదితర పౌష్టిహకారాన్ని మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక సత్యసాయిసేవా సమితి వారు సమకూర్చిన ఈ పౌష్టిహకారాన్ని వైద్యాధికారులు ఎస్.హరిప్రవీణ్, ఎస్.గాయత్రి చేతుల మీదుగా చేతుల గర్భిణీలకు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే పొలాలు

... 5వ పేజీ తరువాయి

ప్రాథమికంగా అంచనావేశారు.

రావికమతం మండలంలోని దొండపూడి, పి.పోన్నవోలు, మేడివాడ, గర్నికం, డిడ్డి, బాధనపాడు, పెదపాచిల తదితర గ్రామాల్లో 22.6 హెక్టారుల్లో వరి పంట ముంపునకు గురైంది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రాథమికంగా అంచనా వేశారు.

రెండు ఎకరాల్లో వరిపైరు మునిగిపోయింది

- పల్లా అప్పారావు, కన్నంపాలెం, చోడవరం మండలం



రెండు ఎకరాల్లో వరి సాగుచేపట్టాను. సుమారు నెల రోజుల క్రితం నాట్లు పూర్తయ్యాయి. ఇంతవరకు వివిధ రకాల పనులు, ఎరువుల కోసం సుమారు రూ.25 వేల వరకు ఖర్చయ్యాయి. గత వారం రోజుల నుంచి రెండు పర్యాయాలు కురిసిన భారీ వర్షాలకు వరి పంట మొత్తం నీట మునిగింది. నదుల్లో వరద తగ్గకపోవడంతో పొలాల్లో నుంచి నీరు బయటకు వెళ్లడంలేదు. గత ఏడాది వర్షాలు సరిగా లేక పంట చేతికి రాలేదు. ఈ ఏడాది అధిక వర్షాలతో మళ్లీ అదే పరిస్థితి ఏర్పడింది.

మేజర్, మైనర్ శారదా నదుల్లో తగ్గని వరద

- ముంపు నుంచి తేరుకోని వరి పొలాలు

రాంబిల్లి : వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తోడు, ఎగువ ప్రాంతాల్లో నుంచి రాంబిల్లి మండలం మీదుగా పయనించే మేజర్, మైనర్ శారదా నదులు గత మూడు రోజుల నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రమాదకరస్థాయిలో వరద ప్రవాహిస్తుండడంతో బలహీనంగా ఉన్న నదుల గట్లకు గండ్లు పడే ప్రమాదం వుందని పలు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం వర్షం కురవనప్పటికీ మైనర్, మేజర్ శారదా నదుల్లో వరద ఉధృతి తగ్గలేదు. కొప్పుగొండుపాలెం, పెదకలవలాపల్లి, వెల్చూరు, రాజుకోడూరు, పంచదార్ల, మర్రిపాలెం, కట్టుబోలు, కుమ్మరాపల్లి, రజాలఅగ్రహారం తదితర గ్రామాల పరిధిలో వరి పొలాలు మూడు రోజుల నుంచి ముంపులోనే ఉన్నాయి. మండలంలో 124 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైనట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గోడ కూలి మహిళకు గాయాలు

గొలుగొండ సెప్టెంబరు 10 : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పాతజోంగంపేటలో వాసం త్రిమూర్తులమ్మకు చెందిన పూరిల్లు గోడ సోమవారం అర్థరాత్రి కూలిపోయింది. ఆ ఇంట్లో త్రిమూర్తులు నిద్రిస్తుండగా గోడ కూలడంతో ఆమె గాయపడ్డారు. ఆమెను చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. స్థానిక వీఆర్వో రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు వీఆర్వో తెలిపారు.


చికిత్స పొందుతున్న త్రిమూర్తులమ్మ

శృంగవరం డీలర్‌పై ఆర్డీవోకు ఫిర్యాదు

నాతవరం, సెప్టెంబరు 10 : మండలంలోని శృంగవరంలో రేషన్ దుకాణం నిర్వహిస్తున్న సుర్ల రాంబాబు స్థానంలో వేరే వ్యక్తిని నియమించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన యు.రాజుబాబు, బి.శ్రీను తదితరులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం డీలర్‌గా విధులు నిర్వహిస్తున్న రాంబాబు మంగళగిరి పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏక కాలంలో రెండు విధులు నిర్వహించడం వల్ల ఆయన రేషన్ దుకాణాన్ని సరిగా నిర్వహించడం లేదన్నారు. దీనిపై కొన్ని నెలల కిందట సివిల్ సప్లయ్ డీటీ విచారణ చేపట్టి రాంబాబు రెండు చోట్ల విధులు నిర్వహిస్తున్నట్టు నిర్ధారించారన్నారు. ఇది జరిగి నెల దాటినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికంగా వ్యక్తిని రేషన్‌షాపు నెంబరు 10లో డీలరుగా నియమించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండండి

... 5వ పేజీ తరువాయి

కారణంగా జిల్లాలో 40 ఇళ్లు దెబ్బతిన్నాయని, రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి సుమారు 80 కిలోమీటర్ల మేరకు రహదారులు పాడయ్యాయని వివరించారు. వరద ఉధృతికి దెబ్బతిన్న కల్వర్టులను పునరుద్ధరిస్తున్నామని, జిల్లాలో ఐదు ప్రధాన రిజర్వాయర్లు ఉండగా రైవాడ మినహా మిగిలిన రిజర్వాయర్లు నిండడంతో అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో విద్యుత్ శాఖకు సంబంధించి 33 కేవీ ఫీడర్‌లకు ఎటువంటి నష్టం జరగలేదని, 11 కేవీ ఫీడర్లకు మాత్రం కొంతమేరకు నష్టం జరిగిందన్నారు. వివిధ ప్రాంతాల్లో 48 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, వీటిని 24 గంటల్లో పునరుద్ధరించామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్‌ఓ బి.దయానిధి, డీఆర్‌డీఏ, బీసీ కార్పొరేషన్, గృహ నిర్మాణ, పౌరసరఫరాలు, వైద్య ఆరోగ్య, మత్స్యకార, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, ఈపీడీసీఎల్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్నిమాపక, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.


వడ్డాదిలో అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తాతయ్యబాబు

వడ్డాదిలో అన్న సమారాధన

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 10: చవితి ఉత్సవాల్లో భాగంగా వడ్డాదిలో మంగళవారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ప్రారంభించారు. అంతకు ముందు వినాయకస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మ సంప్రదాయంలో ముఖ్యమైన భాగం అన్నదానమన్నారు. దాదాపు రెండు వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, టీడీపీ నాయకులు ఏ.కనకరాజు, పలూకూరి భైరవకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

తాచేరు డైవర్షన్ రోడ్డు మరమ్మతు చేపట్టాలి


వరద నీటి ప్రవాహానికి దెబ్బతిన్న తాచేరు డైవర్షన్ రోడ్డు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 10: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెన పక్కన నిర్మించిన డైవర్షన్ రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టి రవాణాను పునరుద్ధరించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. భారీ వర్షాలకు తాచేరు డైవర్షన్ రోడ్డు దెబ్బతినడంతో ఈ నెల 7వ తేదీ నుంచి డైవర్షన్ రోడ్డుపై రవాణాను అధికారులు నిలిపివేసిన విషయం విదితమే. దీంతో బీఎన్ రోడ్డులో రవాణా అస్తవ్యస్తంగా మారింది. పాడేరు, విశాఖపట్నం, అనకాపల్లి, చోడవరం ప్రాంతాలకు రవాణాకు అధిక వ్యయ, ప్రయాసాలకోర్చాల్సి వస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. కిలోమీటరు దూరంలో ఉన్న వడ్డాది చేరుకోవాలంటే రానుపోను 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుందని విజయరామరాజుపేట, కుముదాంపేట, మంగళాపురం తదితర గ్రామాల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

22.6 హెక్టార్లలో నీట మునిగిన వరి: ఏవో

రావికమతం,సెప్టెంబరు 10: మండలంలో 22.6 హెక్టార్లలో వరి పంట తుఫాన్ వర్షాలతో నీట మునిగిందని మండల వ్యవసాయాధికారి రూప చెప్పారు. పలు గ్రామాలలో నీటి ముంపునకు గురైన వరి పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కల్యాణపులోవ రిజర్వాయర్‌తో పాటు చెరువులు, గెడ్డలు, వాగులు పొంగి పారడంతో దొండపూడి, పి.పొన్నవోలు, మేడివాడ, గర్నికం, డిడ్డి, బాధనపాడు, పెదపాచిల తదితర గ్రామాల్లో 22.6 హెక్టార్లలో వరి నీట మునిగినట్టు గుర్తించామన్నారు. వర్షాలు తగ్గడంతో కొన్ని చోట్ల ముంపులో ఉన్న వరిని బయటకు తీస్తే పెద్దగా నష్టం ఉండకపోవచ్చునని ఏవో చెప్పారు.


రావికమతం: దొండపూడి లాణా వద్ద వరి పొలాలను పరిశీలిస్తున్న ఏవో

కొవ్వూరులో ఓట్ల తొలగింపుపై విచారణ

రోలుగుంట, సెప్టెంబరు 10: మండలంలోని కొవ్వూరులో ఓట్ల తొలగింపుపై గ్రామ సచివాలయంలో మంగళవారం విచారణ చేపట్టారు. గత ఏడాది ఆగస్టులో ఓటర్ల జాబితా నుంచి 13 మంది ఓట్లు తొలగించిన ఘటనపై అప్పటి ఆర్వో ప్రమీలగాంధీ బీఎల్వోగా విధులు నిర్వహిస్తున్న శీరంరెడ్డి ప్రభావతిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన ఐటీడీపీ మండల కన్వీనర్ బంటు రాజు సమగ్ర విచారణ చేపట్టాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మరోమారు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం తహసీల్దార్ వరహాలు, ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో భాస్కర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఓట్లు కోల్పోయిన 13 మందిని పిలవగా ఏడుగురు విచారణ హాజరయ్యారు. వీరి నుంచి స్టేట్‌మెంటు రికార్డు చేసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు.


గ్రామ సచివాలయంలో విచారణ చేపడుతున్న తహసీల్దార్, ఆర్ఐ

రూ.కోటితో ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీలు

- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, సెప్టెంబరు 10: పట్టణంలోని వాన నీటి ముంపునకు గురవుతున్న వార్డుల్లో రూ.కోటితో డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రకటించారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించి వరద నీటి ముంపునకు గురైన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ద్వారకానగర్, బాలాజీనగర్, పోలీసు స్టేషన్ సమీపంలోని వార్డుల్లో ప్రజలతో మాట్లాడారు. ఈ ప్రాంతాల్లో కాలువల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించడంతో పాటు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో నారాయణరావు, మాజీ ఎంపీపీ పెదబాబు, వార్డు సభ్యుడు తానవరపు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


చోడవరంలోని కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజు

కిడ్నీ వ్యాధి బాధితురాలికి ఆర్థిక సాయం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 10: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సీతయ్యపేటకు చెందిన బాధితురాలు నానిపల్లి దుర్గమ్మకు స్థానిక యువకులు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. బాధితురాలి తనయుడు నానికి రూ.41,900 నగదును అందజేశారు. మెరుగైన వైద్య సేవల కోసం నగదు అందచేసిన యువకులను సర్పంచ్ వజ్రపు ఇందిర, నాయకులు శ్రీను, బాబురావు, రాజుబాబు, కె.నాగేశ్వరరావు అభినందించారు.

రైవాడ జలాశయం పరిశీలన


రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు

దేవరాపల్లి, సెప్టెంబరు 10: మండలంలోని రైవాడ జలాశయాన్ని ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ, జడ్పీటీసీ సభ్యురాలు కర్రి సత్యం మంగళవారం పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా జలాశయ పరిస్థితులను పరిశీలించి నీటి నిల్వల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల వెంకటరమణ, నాయకులు శారది, వంటాకు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన

కె.కోటపాడు, సెప్టెంబరు 10: జీవో నంబరు 115ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు మంగళవారం ఆందోళన బాట పట్టారు. స్థానిక 50 పడకల ఆస్పత్రి సిబ్బంది నిరసన తెలిపారు. పదేళ్ల నుంచి రెగ్యులర్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మికి వీరంతా వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు నాగమణి, స్థానిక నేతలు రేవతి, పుష్పకళ, పార్వతి, సంధ్య పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో జన్‌మన్ సభలు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 10: మండలంలోని జాలంపల్లి పంచాయతీ శివారు బుట్టల జాలంపల్లి, కామకూటం గ్రామాల్లో మంగళవారం పీఎం జన్‌మన్ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజారామ్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించేందుకు పీఎం జన్‌మన్ కార్యక్రమం చేపట్టారన్నారు. గ్రామస్థాయి అధికారులు గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు స్థితిగతులు తెలుసుకుని ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధారమల్లేశ్వరి, ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలరావు, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వండి

కె.కోటపాడు, సెప్టెంబరు 10: గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో సబ్బి అప్పలరాజు కోరారు. కె.కోటపాడు బజారు, సంత ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించి, చేపల దుకాణాలను పరిశీలించారు. వర్షాకాలం అయినందున దుకాణాల్లోని చెత్త వ్యర్థాలను డబ్బాల్లో వేయాలని కోరారు. రోడ్లపై చెత్త వేయరాదని, పరిశుభ్రత పాటించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


మాంసం దుకాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

టెన్త్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

దేవరాపల్లి, సెప్టెంబరు 10: స్థానిక బీసీ వసతి గృహంలోని పదో తరగతి విద్యార్థులకు వార్డెన్ లక్ష్మీనారాయణ మంగళవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. 11 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షలకు ఉపయోగపడతాయన్నారు.

పాత చెరువులో మట్టి తొలగించండి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు

చోడవరం, సెప్టెంబరు 10: పట్టణంలోని కాలనీలను ముంపు బారి నుంచి తప్పించడానికి వెంటనే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పాత చెరువులోని ఆక్రమణ స్థానంలో వేసిన మట్టిని తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని వరదనీరు వచ్చే మార్గాన్ని కప్పి, ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలం వద్ద మట్టి వేయడంతో వరదనీరు బయటకు పోవడానికి అవకాశం లేక కాలనీలను ముంచెత్తిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి పాతచెరువు ప్రాంతంలో వేసిన మట్టిని తొలగించాలని, కాలువలను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 10: మండలంలో పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. బుచ్చెయ్యపేటలో జరుగుతున్న ఈ పనులను ఎంపీడీవో సువర్ణరాజు, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి మంగళవారం పర్యవేక్షించారు. కాలువల్లో పూడికతీత, రహదారులపై నిలిచిన వర్షం నీటిని కాలువలోకి పంపించడం, వాటర్ ట్యాంకు, చేతిబోర్లలో క్లోరేషన్ చేయడం తదితర పనులను చేపడుతున్నారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, భారీ వర్షాలకు అంటు వ్యాధులు ప్రబలకుండా చేపడుతున్న పారిశుధ్య పనులకు సహకరించాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 10: వడ్డాది సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ రాజు తెలిపారు. కొత్త బేకర్ బిగించడానికి ఉదయం 9 నుంచి 11 గంటల వరకు వడ్డాది నుంచి కోమళ్లపూడి, మంగళాపురం వరకు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

గిరిజన గ్రామాల్లో జ్వరాల విజృంభణ

దేవరాపల్లి, సెప్టెంబరు 10: భారీ వర్షాలకు మూడు గిరిజన పంచాయతీల్లో వైరల్ జ్వరాలు విజృంభించాయి. తామరబ్బ, చింతలపూడి, వాలాబు తదితర జ్వరాలు ఎక్కువగా ప్రబలినట్టు గిరిజనులు తెలిపారు. జాకేరు నరసింహమూర్తి, నక్కా కన్నమ్మ, జాకేరు గంగులు, ముత్యాలదొర, బంగారమ్మ, కొర్రా దేముడబ్బాయి తదితరులు జ్వరాలతో బాధ పడుతున్నారన్నారు.

టీడీపీ సీనియర్ నేత రమణ మృతి

దేవరాపల్లి, సెప్టెంబరు 10: మండలంలోని ఎన్.గజపతినగరానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పోతల రమణ (80) మంగళవారం మృతి చెందారు. మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణకు ముఖ్య అనుచరుడిగా ఉండేవారని, పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కార్యకర్తగా, నేతగా గ్రామానికి, పార్టీకి ఎంతో సేవ చేశారని, రమణ మృతి పార్టీకి తీరని లోటని ఈ సందర్భంగా పార్టీ నేతలు పేర్కొన్నారు.

మంచాలలో 32 మందికి వైద్య సేవలు

చీడికాడ, సెప్టెంబరు 10: మండలంలోని మంచాల గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. చీడికాడ పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 32 మంది రోగులను తనిఖీ చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు తదితరులు కలిసి ఇంటింటికీ వెళ్లి జ్వరాలు, ఇతర వ్యాధుల గురించి ఆరా తీశారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షాకాలం పూర్తయ్యే వరకు కాచిచల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కె.కోటపాడు, సెప్టెంబరు 10: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో మంగతాయారు చెప్పారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు-1, 2, 3లో మంగళవారం పౌష్టికాహార మహోత్సవం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త నేర చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు పోషకాహారాన్ని అందించారు. ఎంపీటీసీ సభ్యురాలు బంగారి లక్ష్మి, సూపర్‌వైజర్ సుశీల, మహిళా పోలీస్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు డి.కుమారి, బి.లక్ష్మి, గాలి గౌతమి, బాలలు పాల్గొన్నారు.